RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

గురువారం 12 సెప్టెంబర్ 2024

quicktodaynews.com



మొదటి పేజీ తరువాయి..



# చెరసాల తప్పదు

అందిస్తామని హామీ ఇచ్చారు. నివాసితులైన 11వేల మందిలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని భరోసా కల్పించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలను రెగ్యులరైజ్ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇకపోతే తెలంగాణ సాధించుకున్న తరువాత విద్యార్థుల్లో, ఉద్యమకారుల్లో , ప్రజల్లో ఎంతో అసంతృప్తిగా ఉందని.. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు తరువాత నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కొత్తగా నియమించి ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు. తెలంగాణలో అవలక్షణాలతో డ్రగ్స్ బానిసలయ్యారన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. పోలీస్ ఉంటే ఉద్యోగం కాదు.. ఇది ఎమోషన్ , బాగోద్వేగం.. డ్రగ్స్ , గంజాయి, సైబర్ క్రైమ్‌పై మీరు బలంగా పని చేస్తారని మీ పై పూర్తి విశ్వాసం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణాలో పెట్టుబడులు తీసుకురావడంతో పాటు ప్రజల కుల వృత్తులను ఆదుకుంటూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. దేశ చరిత్రలోనే 18 వేల కోట్లు రూపాయలు కడుపు కట్టుకొని రైతుల అకౌంట్లలో జమ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని, రుణమాఫీతో రైతన్నల కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. పేదల పట్ల ప్రభుత్వం మానవతా ధోరణితో వ్యవహరిస్తుందని, 11 వేల మంది బాధితులకు రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ పోలీస్ అకాడేమి నుండి ఈరోజు 547 సబ్ ఇన్స్‌పెక్టర్లు పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారిలో 145 మంది మహిళా ఎస్ఐలు, 402 మంది పురుషులు ఉన్నారు. 547 లో 401 మంది సివిల్ ఎస్ఐలు ఉన్నారు. అలాగే 547లో 472 మంది గ్రాడ్యుట్స్, 75 మంది పోస్ట్ గ్రాడ్యుఎట్స్ ఉన్నారు. వీరిలో 248 మంది ఎస్ఐలకు బీ టెక్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. పరేడ్ కమాండర్‌గా మహిళా ఎస్ఐ పల్లి బాగ్యశ్రీ వ్యవహరించారు. ట్రైనింగ్ పూర్తిచేసుకున్న వారిలో అత్యధికంగా 26 నుంచి ముప్పై వయసు గల అభ్యర్థులు ఉన్నారు. 283 మంది 26 నుంచి 30 సంవత్సరాల వయసు కలవారు శిక్షణ పొందారు. అలాగే 182 మంది 25 ఏళ్ళ లోపు వయసున్నవారు సబ్ ఇన్స్‌పెక్టర్లుగా శిక్షణ పొందారు. లా అండ అర్డర్ పరిరక్షణలో పోలీసులదే కీలక పాత్ర అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పోలీసులపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, పోలీస్ స్కూల్ ఏర్పాటుకు 50 ఎకరాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. డ్రగ్స్ గంజాయిపై పోలీసు సిబ్బంది ఉక్కుపాదం మోపుతున్నామన్నారని ప్రశంసించారు. ప్రజల అవసరాలు తీర్చేవిధంగా కాంగ్రెస్ ప్రజాపాలన చేస్తోందని స్పష్టం చేశారు. గత సర్కార్ హయాంలో టిఎస్ పిఎస్ సిలో లీకేజీలు జరిగాయని, నిరుద్యోగల అసంతృప్తితోనే ప్రజాపాలన వచ్చిందని రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఉద్యోగాల భర్తీ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రేవంత్ వివరించారు. టిఎస్ సిపిఎస్ పై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవని, గతంలో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి వచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు వరసగా ఇస్తున్నామని వివరించారు. ఇదే వేదికపై నుంచి పోలీసులకు వరాలు ప్రకటించారు. పోలీసుల పిల్లల కోసం రెండు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించ బోతున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఒకటి వరంగల్‌లో రెండోది నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో 50 ఎకరాల్లో పోలీసుల పిల్లల కోసం రెసిడెన్షియల్ పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే రెండేళ్లలో హైదరాబాద్‌లో పోలీస్ స్కూల్ ప్రవేశాలు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీసు ఉద్యోగమనేది బాధ్యతమాత్రమే కాదని... భావోధ్వేగమని అన్నారు. తెలంగాణను పునర్నిర్మించి, భవిష్యత్ తరాలకు బాటలు వేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు రేవంత్.

# అనిల్ అరోరా ఆత్మహత్య

ఉన్న మలైకా అరోరా.. తండ్రి మరణవార్త తెలియగానే ముంబయి బయల్దేరారు. మరోవైపు, మలైకా మాజీ భర్త, నటుడు అర్బాజ్ ఖాన్ కూడా అనిల్ నివాసానికి చేరుకున్నారు. ఘటనా స్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని పోలీసు వర్గాలు వెల్లడించాయి. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. మలైకా 11 ఏళ్ల వయసులోనే ఆమె తల్లిదండ్రులు విడిపోయారు. అప్పటినుంచి మలైకా, ఆమె సోదరి అమృత తల్లి వద్దే పెరిగారు. అనిల్ ఒంటరిగా బాంద్రాలో నివాసముంటున్నారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. గతేడాది ఆసుపత్రిలో చేరగా.. తండ్రిని చూసేందుకు మలైకా తల్లితో కలిసివెళ్లారు. పంజాబ్‌కు చెందిన అనిల్ అరోరా మర్చెంట్ నేవీలో పనిచేశారు. తల్లిదండ్రులు విడిపోవడంపై గతంలో మలైకా ఓ సందర్భంలో మాట్లాడారు. ఆ కఠిన క్షణాలు తనకు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పాయని అన్నారు. నా బాల్యం అద్భుతంగా గడిచింది. కానీ, అంత సులభం కాదు.. గందరగోళంగా అని చెప్పొచ్చు. అయితే, అలాంటి కష్ట సమయాలే మనకు ఎన్నో నేర్పుతాయి. నా తల్లిదండ్రులు విడిపోవడంతో మా అమ్మను నేను కొత్త కోణంలో చూడగలిగా. స్వతంత్రంగా ఎలా ఉండాలో తెలుసుకున్నా. ఆ పాఠాలే నా వ్యక్తిగత, వృత్తిజీవిత ప్రయాణానికి మూలస్తంభాలు. నా చుట్టూ ప్రపంచం ఎలా ఉన్నా సరే నేను మాత్రం బలంగా, స్వతంత్రంగా నిలబడగలుగుతున్నా అని మలైకా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

## 17న తెలంగాణ
# విమోచన దినోత్సవం

ప్రజా ప్రతినిధులు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల్లో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే నేతల పేర్లను విడుదల చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల ఆఫీసులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగరవేయాలి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ రాష్ట్రంలో 1945లో రైతుల తిరుగుబాటు పక్రియ మొదలైంది. వెట్టి చాకిరీ, భగీలా, లెవీ విధానం, జాగీర్దార్లపై తిరుగుబాటు ప్రారంభమైంది. 1947లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. తెలంగాణ మాత్రం నిజాం పాలనలో మగ్గుతోంది. బ్రిటిష్ ఇండియాలో ఉన్న భూభాగాన్ని మాత్రమే బ్రిటిష్ వారు అప్పగించారు. సంస్థానాలు దేశంలో కలవాలా లేదా అనే నిర్ణయాన్ని వాటికే వదిలేశారు. దాంతో నిజాం రాజు భారతదేశంలో కలిసేందుకు అంగీకరించలేదు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ చొరవతో నిజాం రాజు తొకముడిచారు. 1948 సెప్టెంబర్ 17వ తేదీన నిజాం రాజు కబంధ హస్తాల తెలంగాణ రాష్ట్రానికి విముక్తి కలిగింది. ఆ రోజు నుంచి తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించేవారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తామని ప్రకటన చేసింది.



# 4వేల మెగావాట్ల ఉత్పత్తి

సూచించారు. పవర్ ప్లాంట్ నుంచి దామరచర్ల వరకు బొగ్గు రవాణా ఇతర అవసరాలకు నాలుగు లైన్ల ప్రత్యేక రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు. దామచర్ల యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రాజెక్ట్ పనులపై జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతో డిప్యూటీ సీఎం, మంత్రులు బుధవారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి రివ్యూ మీటింగ్ నల్గొండ జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు పవర్ ప్లాంట్ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు. వచ్చే మార్చి లోపు పవర్ ప్లాంట్ నుంచి 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు మంత్రులు ఆదేశించారు. మహోన్నత ఆశయం కోసం భూమిని త్యాగం చేసి.. ప్రాజెక్టు కోసం భూమి కోల్పోయిన వారిని గౌరవించాలని.. భూ నిర్వాసితులకు పరిహారం సత్వరమే చెల్లించాలని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. ప్రాజెక్టు ప్రారంభమయ్యే లోగా అర్హులైన వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. కూలీలను పెంచి, పవర్ ప్లాంట్ నుంచి దామరచర్ల వరకు బొగ్గు రవాణా, ఇతర అవసరాలకు 4 లైన్ల ప్రత్యేక రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మంత్రులు చెప్పారు.

## జీహెచ్ఎంసీ పరిధిలో 262
# అక్రమ నిర్మాణాలు నేలమట్టం

చేసుకున్నట్లు వెల్లడించింది. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. హైడ్రా గత రెండు నెలలుగా చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. నిబంధన లకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను ఎక్కడా ఉపేక్షించకుండా నేలమట్టం చేస్తోంది. రామ్‌నగర్ మణెమ్మ గల్లీలో 3, గగన్ పహాడ్ అప్పా చెరువులో 14, అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిధిలో 24, మాదాపూర్ సున్నం చెరువులో 42, దుండిగల్ కత్వా చెరువు పరిధిలో 13 అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు హైడ్రా వెల్లడించింది. అత్యధికంగా అమీన్‌పూర్‌లో 51 ఎకరాలు, మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. హైడ్రాకు ఐపీఎస్ అధికారి రంగనాథ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. దీనికి ప్రత్యేక పోలీసు సిబ్బందిని కేటాయిస్తూ డీజీపీ కార్యాలయం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. 15 మంది సీఐ స్థాయి, 8 మంది ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులు ఆక్రమణల కూల్చివేత కోసం పనిచేయనున్నారు. దీంతో హైడ్రా చర్యలు వేగవంతం కానున్నాయి.

## బీజేపీ అధికారంలో ఉంటే
# కేసీఆర్‌కు అంకుశం దింపేది

జీహెచ్ఎంసీ మేయర్ బీజేపీదే అంటూ ధీమా వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి పోటీ చేయడం తథ్యమన్నారు. లౌకికవాదులారా.... జైనూర్ ఘటనపై నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. హిందూ పండుగలపై ఆంక్షలు పెడుతుంటే ఎందుకు స్పందించరని అడిగారు. జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించని వాళ్లు తన దృష్టిలో భారతీయులే కాదన్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కూడా కేంద్రమంత్రి విరుచుకుపడ్డారు. రాహుల్.... క్విట్ ఇండియా అంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాలకు వెళ్లి భారత ఎన్నికల వ్యవస్థను విమర్శిస్తావా? అంటూ మండిపడ్డారు. రిజర్వేషన్లపై నోటికొచ్చినట్లు మాట్లాడతావా అంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల ఏరివేత

బలగాలు అక్కడికి చేరుకొని సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. భారీ వర్షాలు, క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు ఉన్నా ఉగ్రవాదులను ఏరివేయడంలో భద్రతా బలగాలు విజయం సాధించాయి. ప్రస్తుతం సంఘటనా స్థలంలో భారీగా బలగాలను మోహరించారు. ఏద్దైనా అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారం ఇవ్వాలని సైన్యం పౌరులకు విజ్ఞప్తి చేసింది. హతమైన ఉగ్రవాదుల నుంచి ఎం4 రైఫిల్, ఏకే రైఫిల్, పిస్టల్ సహా పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇదిలా ఉండగా.. జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఈ నెల 18 నుంచి మూడు దశల్లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. తెల్లవారుజామున జమ్మూ కశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్‌లో పాక్ బలగాలు అకారణంగా జరిపిన కాల్పుల్లో సరిహద్దు భద్రతా దళం సైనికుడు గాయపడ్డాడు. సైనికులు అప్రమత్తంగా ఉన్నారని భారత్–పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దులో కాపలా కాస్తున్న బీఎస్ఎఫ్ పేర్కొంది. ఈ సరిహద్దు సుమారు 3,323 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నది.

# సిక్కు సంఘాల ఆందోళన

రోజుల పర్యటనలో భాగంగా అమెరికాలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివిధ సభల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా భారతదేశంలో ప్రస్తుతం చోటు చేసుకున్న వివిధ పరిణామాలపై ఆయన ప్రసంగిస్తున్నారు. దేశంలో మత స్వేచ్ఛపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతుంది. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కొన్ని సిక్కు సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో గురువారం న్యూఢిల్లీలోని సోనియా గాంధీ నివాసం వద్ద సిక్కు సంఘాలు ఆందోళన చేపట్టాయి. తన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని ఆ యా సంఘాలు డిమాండ్ చేశాయి. యూఎస్‌లోని జార్జి టౌన్ యూనివర్సిటీలో విద్యార్థులతో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. భారత్‌లో తలపాగాలు, కడియాలు ధరించేందుకు అనుమతి ఉందా? అని సందేహం వ్యక్తం చేశారు. గురు ద్వారాలను సందర్శించేందుకు అనుమతిస్తారా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో ఇదే పోరాటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఃూహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలపై పలు సిక్కు సంఘాలు మండిపడ్డాయి. అందులోభాగంగా బీజేపీకి అనుబంధంగా ఉన్న పలు సిక్కు సంఘాలు బుధవారం జన్‌పథ్ రోడ్డులోని సోనియా గాంధీ నివాసం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టాయి. ఆమె నివాసం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను బద్దలు కొట్టేందుకు ఆందోళన కారులు ఈ సందర్భంగా ప్రయత్నించారు. వారి ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఇంకా రాహుల్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారని తెలిపారు. బడా వ్యాపారులతో నరేంద్ర మోదీ కుమ్మక్కయ్యారని విమర్శించారు. ఎన్నికల వేళ.. కేంద్ర ఎన్నికల సంఘం సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరించిందన్నారు. భారత్‌లో హక్కుల కోసం సంఘర్షణ కొనసాగుతుందని తెలిపారు. సిక్కులు తలపాగా ధరించే హక్కు సైతం లేదన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో
# వరదనష్టంపై నివేదిక

తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి కృష్ణా జిల్లా అతలాకుతలమయ్యాయి. దీంతో ఆ యా జిల్లాలోని పలు ప్రాంతాలు జలదిగ్బందనంలో చిక్కుకున్నాయి. పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. దాంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నేపథ్యంలో ఆ యా రాష్ట్రాల్లోని ఆ యా జిల్లాల్లో ఇటీవల కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్వయంగా పర్యటించారు. ముంపు ప్రాంతాల్లో సైతం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులతో కేంద్ర మంతి చౌహాన్ భేటీ అయ్యారు. వరద నష్టంపై ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి నివేదిక అందజేశారు. రోవైపు తెలుగు రాష్ట్రాల్లో వరద సాయం కింద రూ. 3,300 కోట్ల తక్షణ సాయన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సాయాన్ని వెంటనే విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఇంకోవైపు ఈ వరద విపత్తుపై తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ఉద్యోగ సంఘాలు సైతం స్పందించాయి. టాలీవుడ్ పరిశ్రమకు చెందిన పలువురు నటీనటులు సైతం భారీగా ఆర్థిక సాయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# వెంటాడిన మృత్యువు

నిడదవోలు మండలం కాటకోటేశ్వరానికి చెందిన బొక్కా ప్రసాద్ ఈ ఘటనలో మృతి చెందారు. డీఎస్పీ దేవకుమార్, ఎస్సైలు శ్రీహరిరావు, సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దేవరపల్లి మండలం చిలకావారిపాకలు వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏడుగురు కూలీలు ప్రాణాలు కోల్పోవడం కలచివేసిందని చంద్రబాబు అన్నారు.

# క్లిష్టంగా బోట్ల తొలగింపు

కాకినాడ నుంచి అండర్ వాటర్ డ్రైవర్స్ నిపుణులతో బోట్స్‌ను రెండు ముక్కలుగా చేసి వాటిని తీసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కట్ చేసిన బోట్స్‌ను ఎయిర్ బెలూన్ సహాయంతో పైకి తీస్తామన్నారు. మరికొద్దిసేపట్లో ఆ పక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఒక్కొక్క బోటు సుమారు 30 టన్నుల బరువు ఉండటంతో అవి తొలగించడం కష్ట సాధ్యంగా మారుతోందన్నారు. బోట్లకు ఒక దానికి ఒకటి గొలుసు వేయడంతో కౌంటర్ వెయిట్స్‌ను గుద్దుకుని నీటి లోపలికి రెండు.. నీటిపై భాగంలో రెండు బోట్స్ ఉన్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.బుడమేరు కబ్జా కోసం మంజూరు చేసిన పనులను రద్దు చేశారనిమండిపడ్డారు.

# బుడమేరు కబ్జా

కోసం మంజూరు చేసిన పనులను రద్దు చేశారనిమండిపడ్డారు. బుడమేరు మొత్తం జగన్ మనుషులు ఆక్రమించుకుని అమ్మేశారని.. నీళ్ళు పోవాల్సిన బుడమేరుని కబ్జా చేసి విజయవాడను ముంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో వైఎస్ఆర్‌సీపీ చేసిన పాపాలే.. రాష్ట్రానికి శాపాలుగా మారాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుడమేరు గండ్లు పూడ్చివేత విషయంలో ఆర్మీ సైతం చేతులెత్తేసినా ఏపీ ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ అధికారులను, మంత్రి నిమ్మల రామానాయుడు పట్టుబట్టి పూర్తి చేశారని చంద్రబాబు అభినందించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క సారి కూడా బుడమేరు పూడిక తీయలేదని గుర్తు చేశారు. గతంలో వచ్చిన వర్షాలకు గండ్లు పడినా పూడ్చలేదన్నారు. బుడమేరు వాగు పరిధిలో గత ప్రభుత్వం అక్రమార్కులను ప్రోత్సహించిందని చంద్రబాబు ఆరోపించారు.

# జగన్‌కు హైకోర్టులో ఊరట

కోర్టు ఏడాదికి పరిమితం చేసిన రెన్యువల్ ను ఐదేళ్లకు పెంచూతూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్ట్ విధించిన పాస్‌పోర్టు కాలపరిమితిని ఒక ఏడాది నుంచి ఐదేళ్లకు పెంచుతూ ఆదేశాలు ఇచ్చింది. కానీ విజయవాడ కోర్ట్ ఆదేశాల ప్రకారం ప్రజాప్రతినిధుల కోర్ట్‌కు వెళ్లి రూ.20 వేల పూచీకత్తు స్వయంగా సమర్పించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ట్రయల్ కోర్ట్ విధించిన మిగతా షరతులు అన్నీ యథావిధిగా ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది.

# జైలులో పరామర్శలా?

కనీసం 20 నిమిషాలపాటు కూడా పలకించ లేదని, జైలులో ఉన్న వ్యక్తి కోసం బెంగళూరు నుంచి గుంటూరు జైలుకు వచ్చి సమయం కెటాయించడం శోచనీయమన్నారు. జనాలు కష్టాల్లో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. వైసీపీ హయాంలో కడప జిల్లా పించా, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి వంద మంది వరకు చనిపోతే ఇప్పటివరకు జగన్‌ను ఒక్క పైసా అందించలేదని ఆరోపించారు. విజయవాడకు వంద సంవత్సరాల తరువాత భారీ వర్షాలు పడి వరదలు వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు 12 రోజుల పాటు క్షేత్రస్థాయిలోనే ఉండి బాధితులకు అండగా నిలిచారని ప్రశంసించారు. అధికారులందరిని మోహరించి కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకున్నారని తెలిపారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు.

# లంకగ్రామాల విలవిల

వరదలు లంక గ్రామాలను చుట్టుముట్టాయి. గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతుండటంతో కోనసీమ పరిధిలోని గోదావరి తీర లంక గ్రామాలు ముంపుతో అల్లాడుతున్నాయి. వరద ఉధృతి దృష్ట్యా అధికారులు నాటు పడవల రాకపోకలపై ఆంక్షలు విధించడంతో లంక గ్రామాలకు వెళ్లేవారికి, లంక గ్రామాల నుంచి ఇవతలి తీరానికి వచ్చే వారికి ఇబ్బందులు పెరిగాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. దీంతో గోదావరి తీరంలోని లంక గ్రామాల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. లంకల్లో పంట పొలాలున్నవారు, పాడిపశువులున్నవారు వెళ్లటానికి మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమలో భాగమైన ఆచంట మండలం పరిధిలోని అయోధ్యలంక, పుచ్చల్లంక, గ్రామాల వద్ద గంటగంటకూ గోదావరి మట్టం పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నిత్యావసర వస్తువులు కావాలన్నా గోదావరి దాటి రావాల్సి ఉండటంతో ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారు.

# ఇంతటి అధ్వాన పాలన ఎప్పుడూ చూడలేదు

అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు. తుపాను వస్తుందని ముందే చెప్పినా బాబు పట్టించుకోలేదు. తన ఇంటిని రక్షించుకునేందుకు విజయవాడను ముంచారు. బుడమేరు గేట్లు ఎత్తి విజయవాడను ముంచేశారు. చంద్రబాబు తప్పుడు పనికి 60 మందికిపైగా చనిపోయారు. 60 మందిని పొట్టను పెట్టుకున్న బాబుపై కేసు ఎందుకు పెట్టరు?. చంద్రబాబు బోట్ల రాజకీయం చేస్తున్నారు. బోట్లకు ఎవరి హయాంలో పర్మిషన్ వచ్చింది?. చంద్రబాబు గెలవగానే ఇదే బోట్లపై విజయోత్సవాలు చేశారు. బాబు, లోకేష్‌తో కలిసి బోటు ఓనర్ ఉషాద్రి ఫొటోలు దిగాడు. టీడీపీ హయాంలోనే ఈ బోట్లకు అనుమతి ఇచ్చారు. ఈ బోట్లన్నీ టీడీపీ నేతలకు చెందినవే. వాస్తవాలు వక్రీకరించి రాజకీయం చేస్తున్నారని అన్నారు.

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

గురువారం 12 సెప్టెంబర్ 2024

quicktodaynews.com



# గచ్చిబౌలిలో రేవ్ పార్టీ భగ్నం

### 18మంది యువతీయువకుల అరెస్ట్

**హైదరాబాద్, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గెస్ట్‌హౌస్‌లో రేవ్ పార్టీని మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు భగ్నం చేశారు. 18 మంది యువతీయువకులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, సినీరంగానికి చెందిన వారు ఉన్నారు. నిందితుల నుంచి గంజాయి ప్యాకెట్లు, ఇ-సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గాల్లో దీపంలా తెలంగాణ విద్యావ్యవస్థ

### ఎక్స్‌లో పోస్ట్ చేసిన మాజీమంత్రి కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ గాల్లో దీపంలా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సార్లు లేని బడులు, లెక్చరర్లు లేని కాలేజీలు, చివరకు చాక్‌పీసులు-డస్టర్లులేని స్కూళ్లు, అద్దె చెల్లించలేదని కాలేజీకి తాళాలు, రోడ్లపైకి విద్యార్థులు తెలంగాణలో కనిపిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలకు సంబంధించిన పలు వార్త కథనాలను షేర్ చేశారు. పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా గ్రాంట్స్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అని కేటీఆర్ విమర్శించారు. విద్యా శాఖకు మంత్రి లేడని.. శాఖను దగ్గర పెట్టుకున్న ముఖ్యమంత్రి దిక్కు లేదని అన్నారు. పదుల సంఖ్యలో ఢిల్లీకి చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి మీ సొంత నియోజకవర్గంలో అధ్యాపకులు లేక విద్యార్థులు టీసీలు తీస్కొని వెళ్లిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విద్యా శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష జరిపి సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. పిల్లల బంగారు భవిష్యత్తుతో చెలగాటం వద్దని హెచ్చరించారు.

# అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**సిద్దిపేట, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండల పరిధిలోని గల కాన్గల్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దొమ్మాట స్వామి(35)అనే రైతు గత ఐదు సంవత్సరలుగా గ్రామానికి చెందిన పెద్దమాతర మల్లయ్య వద్ద మూడు ఎకరాల వ్యవసాయ పోలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. అయితే పంటలు సరిగా పండనందున అప్పులు ఎక్కువై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తి చెంది తను కౌలుకు చేస్తున్న వ్యవసాయ పొలం వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయినాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య దొమ్మాట లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దార్యాప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ వి.రవికాంతారావు తెలిపారు. స్వామి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సీఎం రేవంత్‌తో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ

### వరదబాధితుల కోసం కోటి చెక్కు అందజేత



**హైదరాబాద్, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. బుధవారం నాడు హైదరాబాద్ వచ్చిన ఆయన.. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిశారు. తెలంగాణ భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన వారికి అండగా నిలుస్తూ పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కోటి రూపాయల విరాళాన్ని సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. పవన్ కల్యాణ్, రేవంత్ రెడ్డి వెంట పలువురు కాంగ్రెస్, జనసేన నేతలు పాల్గొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలంగాణలో మున్నేరు వాగు.. ఏపీలో బుడమేరు పొంగి పొర్లాయి. మహోగ్రరూపం దాల్చిన మున్నేరు ఖమ్మంను ముంచెత్తగా.. బుడమేరు విజయవాడను ముంచేసింది. ఈ వరదలకు పదుల సంఖ్యలో ప్రాణ నష్టం సంభవించగా.. వేలాది మంది నిరాశ్రయుల య్యారు. వేల కోట్లలో ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో వదర బాధితులకు అండగా తన వంతు ఆర్థిక సాయం ప్రకటించారు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. తన సొంత నిధుల నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెరి కోటి రూపాయలు విరాళం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. టీవల ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఏపీకి ప్రకటించిన రూ. కోటి విరాళానికి సంబంధించి చెక్కును అందజేశారు. అదే సమయంలో ముంపునకు గురైన గ్రామాలకు.. రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు పవన్. ఇక తెలంగాణకు సైతం కోటి విరాళం ప్రకటించిన పవన్.. బుధవారం నాడు ఆ విరాళానికి సంబంధించిన చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు.

# భద్రాద్రి వద్ద కొనసాగుతున్న ఉధృతి

### అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి

**భద్రాచలం, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఇక్కడి వరద ఉద్ధృతిని పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్ వద్ద మురుగునీరు బయటకు తోడే ప్రక్రియ, గోదావరి కరకట్ట వద్ద వరద ఉద్ధృతి, కొత్త కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో నీటి పారుదల, పంచాయతీ, ఆర్అండ్‌బీ, అగ్రికల్చర్, విద్యుత్, వైద్య శాఖల అధికారులతో సమీక్షించారు. వరదల కారణంగా ఎదురయ్యే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. గోదావరిలో నీటి ప్రవాహం 50 అడుగులు దాటి ప్రవహిస్తున్నందున ఎప్పటికప్పుడు వరద ఉద్ధృతిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. అంతకంతకూ వరద ఉధృతి పెరుగుతోంది. కాగా భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రం 48 అడుగులుగా ఉన్న నీటిమట్టం.. ఇవాళ ఉదయానికి గరిష్టంగా 50.6 అడుగులకు చేరింది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తున్నారు. 50.6 అడుగులకు నీటిమట్టం చేరిన తర్వాత వరద ఉధృతి క్రమేపీ తగ్గుముఖం పట్టింది. మరోవైపు గోదావరికి వస్తున్న వరదతో అధికారులు అలర్ట్ అయ్యారు. లోతట్టు గ్రామాల ప్రజలను వారిని పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఇప్పటికే ఏజెన్సీలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా గోదావరి నీటిమట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. కాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాచలంలో రివ్యూ మీటింగ్ పెట్టారు. జిల్లా కలెక్టర్ జితేంద్ర వి పాటిల్ తో వరద ప్రవాహాన్ని పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు

# మెడికల్ కాలేజీల అనుమతులపై హర్షం

### మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్రం అనుమతులు

### జిల్లాకో మెడికల్ కాలేజీ సాకారం అయినట్లే

### వైద్య విద్య కోసం కెసిఆర్ ప్రత్యేక కృషి

### మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడం సంతోషించదగ్గ విషయమని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ సహా గత నెలలో మెడికల్ కాలేజీల అనుమతి పొందిన ములుగు, నర్సంపేట, గద్వాల్, నారాయణపేట్ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తాజా అనుమతులతో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజి ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ కల సాకారమైందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మకమైన పురోగతి అని అన్నారు. అరవై ఏళ్లలో సాధ్యం కాని అద్భుతాలను దశాబ్ద కాలంలోనే ఆవిష్కరించిందని పేర్కొన్నారు. తెలంగాణ పిల్లలు వైద్య విద్య కోసమని లక్షలు ఖర్చు చేసి.. చైనా, ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పీన్ వంటి దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని హరీశ్‌రావు తెలిపారు. విద్యార్థులు మాతృ భూమికి, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ అవస్థలు పడాల్సిన అవసరం లేదన్నారు. ’ ఒకవైపు ఎంబీబీఎస్ చదవాలనే ఆశ, మరోవైపు అర్థం కాని భాష, దేశం కాని దేశంలో గోస. ఇదంతా ఒకనాడు. కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలు, లోకల్ రిజర్వేషన్ వల్ల డాక్టర్ చదువాలనుకునే తెలంగాణ విద్యార్థులకు అవకాశాలు పెరిగాయి.’ అని హరీశ్‌రావు అన్నారు. ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజ్ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని.. దేశంలోనే రికార్డు నెలకొల్పిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి మొత్తం 8 మెడికల్ కాలేజీల ఏర్పాటు కోసం గత కేసీఆర్ ప్రభుత్వం నిధులు, భూ కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 8 కాలేజీలకు గాను కేవలం నాలుగు మెడికల్ కాలేజీలకు మాత్రమే గత నెల ఎన్ఎంసీ నుంచి అనుమతులు లభించాయని చెప్పారు. నిబంధనల ప్రకారం మౌలిక వసతుల ఏర్పాటు, బోధనా సిబ్బంది నియామకంలో ప్రభుత్వం విఫలమైందని ఎన్ఎంసీ అనుమతులు నిరాకరించిందని హరీశ్‌రావు తెలిపారు. జరిగిన తప్పును ఆలస్యంగా గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్ఎంసీ నిబంధనల మేరకు అన్ని మౌలిక వసతులు, బోధన సిబ్బందిని సమకూర్చు కుంటామని అనుమతి కోరుతూ కేంద్రానికి అప్పీల్ చేసిందన్నారు. దీన్ని పరిశీలించిన కేంద్రం అప్పీల్ అంగీకరించి, 4 మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని ఎన్ఎంసీకి మార్గనిర్దేశర చేసిందని తెలిపారు. దీంతో ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, మొత్తం నాలుగు కాలేజీల్లో 200 సీట్లు ఈ అకడమిక్ ఇయర్ కు అందుబాటులోకి రానున్నాయన్నారు. కొత్త సీట్లతో కలుపుకొని తెలంగాణలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనే మొత్తం సీట్ల సంఖ్య 4,090 కు చేరుకుందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో కేవలం 850 ప్రభుత్వ మెడికల్ సీట్లు మాత్రమే ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 4,090 సీట్లకు చేరిందని హరీశ్‌రావు తెలిపారు.

# మరోసారి వార్తల్లోకి చిత్రపురి కాలనీ

### అవకతవకలపై పలువురిపై కేసులు నమోదు



**హైదరాబాద్, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** చిత్రపురి కాలనీ సంక్షేమ సంఘం మరోసారి వార్తల్లోకెక్కింది. చిత్రపురి కాలనీలోని ప్లాట్ల కేటాయింపుల్లో భారీ అవకతవకలు జరిగాయని, డబ్బులు చెల్లించిన కమిటీ సభ్యులకు కాకుండా బయటి వారికి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఇలా రోజుకోరకంగా కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలో రెండు మూడు నెలల క్రితం సంఘం అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ అరెస్ట్‌తో ఒక్కసారిగా ఈ విషయం బాగా ప్రాచుర్యం అయింది. ఇదిలాఉండగా.. గత నెలలో చిత్రపురి కాలనీలో అనుమతులు లేకుండా నిర్మించారని, నాటి పాలక వర్గం దొంగచాటుగా నిర్మాణాలకు అనుమతులు పొందినట్లు తేల్చి 225 విల్లాలకు మణికొండ మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. జీ ప్లస్ వన్ కి అనుమతులు పొంది అక్రమంగా జీ ప్లస్ టూ నిర్మాణాలు చేయడంపై మున్సిపల్ అధికారులు సైతం వివరణ ఇవ్వాలంటూ నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలో తాజాగా సైబరాబాద్ డీసీపీ ఆధ్వర్యంలో ఖాజాగూడ చిత్రపురి కమిటీపై సైబరాబాద్ ఏకనామిక్ అఫెన్స్ వింగ్‌లో మూడు కేసులు నమోదవ్వడంతో పాటు ప్రస్తుత, పాత కమిటీలలోని మొత్తం 21 మందిపైన నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద కేసు నమోదయ్యాయి. కేసులు నమోదైన వారిలో అనిల్ కుమార్ యాదవ్,తమ్మారెడ్డి భరద్వాజ, పరుచూరి వెంకటేశ్వరరావు, దీప్తి వాజపేయి, కాదంబరి కిరణ్, వినోద్ బాల, ప్రవీణ్ యాదవ్, సత్యనారాయణ దోరా,
టీ. లలిత, ఆలహరి వివి ప్రసాద్, కొంగర రామకృష్ణ, అనిత నిమ్మగడ్డ, రఘు బత్తుల, మహేంద్ర రెడ్డి, జెల్లా మధుసూదన్, పీఎస్ కృష్ణ మోహన్ రెడ్డి, కె.రాజేశ్వరరెడ్డి, చంద్రమధు, దేవినేని బ్రహ్మానందరావు, కొల్లి రామకృష్ణ, కె.ఉదయభాస్కర రావులు ఉన్నారు. అయితే ఇప్పుడు వీరందరిపై కేసులు నమోదవడంతో చిత్రపరిశ్రమలో కలవరం ప్రారంభమైంది.

# ఆ పదిమందిలో ఉప ఎన్నికల భయం

### పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలి

### అసెంబ్లీ కార్యదర్శిని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10మంది ఎమ్మెల్యేలు వణికిపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. పూటకో పార్టీ మారే దానం నాగేందర్ చీటర్ అంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలంటూ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారంఅసెంబ్లీ కార్యదర్శి నరసింహా చార్యులను కలిశారు. హైకోర్టు నాలుగు వారాల సమయం ఇచ్చిందని, చర్యలు తీసుకోకుంటే సుమోటోగా కేసు స్వీకరిస్తామని హైకోర్టు చెప్పిన విషయాన్ని నరసింహాచార్యులకు వివరించారు. కాలయాపన చేయకుండా తక్షణమే వారిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై పాడి కౌశిక్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..’ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఏ మాత్రం సిగ్గు లేదు. వారు వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనేక పార్టీలు మారారు. ఇకపై ఆయన శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోతారు. కడియం శ్రీహరి పచ్చి మోసగాడు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద పొద్దున బ్యాగులు తీసుకుని సాయంత్రాని కల్లా కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి డిపాజిట్ తెచ్చుకుని చూపించాలి. కాంగ్రెస్‌లో చేరానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ స్వయంగా మీడియాకు చెప్పి ఇప్పుడు మాట మారుస్తున్నారు. అరికెపూడి గాంధీ మా పార్టీ సభ్యుడైతే తెలంగాణ భవన్‌కు రావాలి. స్పీకర్ నిర్ణయం దాకా ఆగకుండా ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉపఎన్నికలను రావాలి. గతంలో కేసీఆర్ విడిగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎల్పీలో సీఎల్పీ విలీనం అయ్యిందని అన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేసే విధంగా మంత్రి శ్రీధర్ బాబు మాటలు ఉన్నాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాలంటే ఎమ్మెల్యేలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు తన గౌరవాన్ని తగ్గించుకునే విధంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. దానం, కడియం, అరికెపూడి మినహా మిగతా ఏడుగురు ఎమ్మెల్యేలపై పిటీషన్ స్పీకర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని చెప్పారు. సుప్రీంకోర్టు బెంచ్ ఎమ్మెల్యేల అనర్హతపై కాలయాపన వద్దని గతంలో తీర్పు ఇచ్చిందని.. హై కోర్టు తీర్పును శ్రీధర్ బాబు వక్రీకరిస్తున్నారని విమర్శించారు. పార్టీ మారితే వెంటనే అనర్హత వేటు వేయాలని దేశం మొత్తం రాహుల్ గాంధీ చెప్తున్న విషయాన్ని కేపీ వివేకానంద గుర్తు చేశారు.

# వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్ట

### వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్ట

### డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తూ పట్టబడ్డ విదేశీయుడు

### దేశ బహిష్కారం చేసిన నార్కోటిక్ పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** వీసా గడువు ముగిసినా నగరంలో ఉంటూ డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్న విదేశీయుడిని హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ పోలీసులు దేశం నుంచి బహిష్కరించారు. 2009లో టూరిస్టు వీసాపై ఇండియాకు వచ్చిన ఐకేజీ ఇన్నోసెంట్ ఎన్‌డుకా.. ముంబైలో తిష్టవేసి స్కార్ఫ్ బిజినెస్ ప్రారంభించాడు. గుజరాత్ లోని సూరత్ నుంచి వస్తువులు కొనుగోలు చేసి ముంబైలో వ్యాపారం చేశాడు. ఏడాది తర్వాత తమిళనాడుకు మకాం మార్చాడు. తిర్పూర్‌లో 4 సంవత్సరాల పాటు టీషర్ట్‌లు విక్రయించాడు. ఆ తర్వాత 2014లో తమిళనాడు నుంచి మకాంను బెంగళూరుకు మార్చాడు. అక్కడ మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌లోకి దిగి, గుట్టుగా ఇతర నైజీరియన్స్‌తో కలిసి డ్రగ్స్ దందా మొదలుపెట్టాడు. దీనిలో భాగంగా ఈ ఏడాది మేలో హైదరాబాద్ వచ్చి డ్రగ్స్ విక్రయిస్తూ పోలీసులకు చిక్కాడు. అతడిని విచారించగా టూరిస్టు వీసాపై వచ్చి కొన్నేళ్లుగా ఇండియాలో అక్రమంగా ఉంటున్నట్లు తేలింది. అసలు ఐడెంటిటీని దాచిపెట్టి, దేశం, తన పేరుతో నకిలీవి క్రియేట్ చేసుకొని ఒక్కో నగరంలో ఒక్కో పేరుతో చెలామణి అయినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. నైజీయా దేశానికి వెళ్లేటప్పుడు మాత్రం ఒరిజినల్ ఐడెంటిటీతో నేరచరిత్ర లేని వ్యక్తిగా క్లీన్ చిట్‌తో వెళు న్నారని హెచ్‌న్యూ పోలీసులు గుర్తించారు. ఇలాంటి కేటుగాళ్లు అక్రమంగా దేశంలో ఉంటూ డ్రగ్స్ మహమ్మారిని విచ్చలవిడిగా సరఫరా చేస్తూ వేలాది మంది యువతను వాటికి బానిసలను చేస్తున్నారు. అలాంటి వారిని దేశం నుంచి డిపోర్టేషన్ (బహిష్కరణ) చేయడమే సరైన మార్గం అని పోలీసులు భావిస్తున్నారు. మూడు నెలల్లో ముగ్గురు నైజీరియన్లను ఇలా డిపోర్టేషన్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# యాదాద్రి ప్లాంట్‌లో కాపర్ వైర్ చోరీ

### చోరీ గ్యాంగ్‌ను పట్టుకున్న పోలీసులు

**మిర్యాలగూడ, సెప్టెంబర్11 (క్విక్ టుడే న్యూస్):** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో కాపర్ చోరీ చేసి పాత ఇనుము వ్యాపారులకు విక్రయిస్తున్న గ్యాంగ్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఏర్పాటుచేసిన ప్రెస్?మీట్?లో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వివరాలు వెల్లడించారు. నిందితులు దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి పవర్ ఎ÷-లాంట్‌లోని బీహెచ్ఈఎల్ కంపెనీకి చెందిన అన్లోడ్ చేసినటువంటి స్టోర్ యాడ్ కాపర్ వస్తువులను దొంగిలించి నిర్మానుష్య ప్రాంతంలో దాచి పెట్టేవారు. ఆ తర్వాత మిర్యాలగూడలోని పాత ఇనుము షాపులో కోట్లలో అమ్మారు. మిర్యాలగూడకు చెందిన మేకల శ్రీను, దామరచర్ల మండలం తాళ్ల వీరప్ప గూడెం గ్రామానికి చెందిన పెండెం భాస్కర్, సాత్ తండా చెందిన గుగులోతు రఘు, దుబ్బ తండాకు చెందిన కొర్ర శివ, తాళ్లవీరప్పగూడెం గ్రామానికి చెందిన చెన్న బోయిన నాగయ్య, సాత్ తండాకు చెందిన గుగులోతు రాముడు, మిర్యాలగూడ పట్టణానికి చెందిన బత్తుల జానకి రాములు, పగడాల బాలరాజులు ముఠా సభ్యులుగా ఏర్పడి రెండేండ్లుగా దొంగతనానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇవాళ ఉదయం ఈదలగూడ సమీపంలో నిందితులను పట్టుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ. 26 లక్షల నగదు, 2 మహీంద్ర క్యాంపర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టామని తెలిపారు.

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

CINEMA

QUICK TODAY

quicktodaynews.com

గురువారం 12 సెప్టెంబర్ 2024





## బెల్లంకొండ సినిమాలో సంయుక్త

టాలీవుడ్ యాక్టర్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడు. వీటిలో బిఎస్ఎస్12ను ఈ ఏడాది జులైలో ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మిస్టిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ మూవీని మహేశ్ చందు నిర్మిస్తున్నారు. ఈ సినిమా మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ చిత్రంలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సంయుక్తా మీనన్ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆమెకు పాత్రకు సంబంధించిన స్టైలిష్, ట్రెండీ లుక్ విడుదల చేశారు. సంయుక్తా మీనన్ ఇందులో సమీర పాత్రలో నటిస్తున్నట్టు పోస్టర్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే టీం క్లారిటీ రానుంది. ఈ మూవీకి లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నాడు. దాశరథి శివేంద్ర సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు. సంయుక్తామీనన్ శర్వానంద్ 37లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. దియా లుక్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది.

# దేవర ట్రైలర్‌పై అభిమానుల పెదవివిరుపు

### ఆచార్యలో సీన్స్ రిపీట్ అంటూ.. పోస్ట్‌లు

ఎంతో మంది అభిమానులు చాలాకాలంగా ఎదురు చూసిన జూ.ఎన్టీఆర్ దేవర సినిమా ట్రైలర్ మంగళవారం రిలీజైంది. అయితే సినిమా కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న ప్రజలకు ఈ ట్రైలర్ బాగా నిరుత్సాహ పర్చింది. దీంతో కొరటాల శివ కేజీఎఫ్ పార్మాట్ లో ఈ సినిమా తీద్దామనుకున్నాడు.. కానీ అది ఆచార్యలానే అయిందనిపిస్తుందంటూ మీమ్స్ క్రియేట్ చేస్తున్నారు. గతంలో ఆచార్య సినిమాలోని సన్నివేశాలను, దేవర ట్రైలర్‌లోని సన్నివేశాలను కంపేర్ చేస్తూ మరీ ట్రోలింగ్ చెయడం విశేషం. అయితే.. ఆచార్య సినిమా అనంతరం దర్శకుడు కొరటాల శివ అల్లు అర్జున్‌తో ఓ సినిమా చెయాల్సి ఉంది. ఆ సినిమాను తొలుత ఎనౌన్స్ చేశారు కూడా. అయితే అనూహ్యంగా ఆ సినిమా క్యాన్సిల్ అవటం.. సడెన్‌గా ఎన్టీఆర్‌తో కొరటాల శివ సినిమా ఫిక్స్ అవటం వెంటనే జరిగిపోయింది. ఆచార్య సినిమా ఫలితం, దాని తదనంతరం చిరంజీవి చేసిన కొన్ని కామెంట్స్.. కొరటాల ఇమేజ్‌ను కంప్లీట్‌గా దెబ్బతీసిన పరిస్దితి కనిపించింది. ఈ క్రమంలో కొరటాల శివ తానేంటో మరలా నిరూపించుకోవాల్సిన పరిస్దితి ఏర్పడింది. ఎన్టీఆర్ కొరటాల శివపై నమ్మకంతో దేవర చేసే అవకాశం ఇచ్చినపుడు.. అభిమానుల నుంచి రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గత ఏడాది కాలంగా దేవర సినిమా చిత్రీకరణ జరగటం.. ఈ సినిమా ఓపెనింగ్ మొదలు.. కాస్టింగ్ సెలెక్షన్.. రెండు పార్టులుగా సినిమాను ప్రకటించటం.. ఇలా నిదానంగా దేవరపై హైప్ క్రియేట్ అయిందనుకున్న క్రమంలో ట్రైలర్ రిలీజ్ అయి దేవరపై ఉన్న పాజిటివ్ బజ్‌ను కాస్త డిస్టర్బ్ చేసినట్లు కన్పిస్తోంది. కొరటాల మాత్రం రెగ్యులర్ కమర్షియల్ సినిమా తరహాలోనే దేవర సినిమాను, ఎన్టీఆర్ పాత్రను డిజైన్ చేయటం బాలేదంటూ సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేస్తున్నారు. కొంతమంది ట్రైలర్‌పై తీవ్ర స్థాయిలో మండి పడుతూ ఇది మరో బచ్చన్ అవుతుందంటూ వీడియోలు చేసి యూ ట్యూబ్‌లో పెడుతున్నారు. అంతేకాదు.. దేవరట్రైలర్ చూశాక, నిర్మాణ విలువలు భారీగా ఉన్నా.. కంటెంట్ ఏమాత్రం ఆసక్తికరంగా లేదని.. ఎన్టీఆర్ కొరటాలకు ఛాన్స్ ఇచ్చి తప్పు చేశాడా అంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు.





## విడాకులపై జయం రవి ఏకపక్ష ప్రకటన

### విషయం తెలిసి షాక్ అయిన భార్య ఆర్తి

భార్యతో విడాకులు తీసుకుంటున్నట్లు జయం రవి ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై రవి భార్య ఆర్తి సంచలన ఆరోపణలు చేశారు. తనకు తెలియకుండానే విడాకుల ప్రకటన చేశారని ఆరోపించారు. బహిరంగ ప్రకటన చూసి తాను దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. ఈమేరకు సోషల్ మీడియాలో ఓ నోట్ విడుదల చేశారు. నాకు తెలియకుండానే నా అనుమతి తీసుకోకుండానే విడాకుల గురించి బహిరంగంగా ప్రకటించారు. ఈ విషయం తెలిసి ఎంతో బాధపడ్డాను. 18 ఏళ్లుగా మేము కలిసి ఉంటున్నాం. అయినా ఇలాంటి ముఖ్యమైన విషయాన్ని నా అనుమతి తీసుకోకుండా ప్రకటించడం నన్ను బాధించింది. కొంతకాలంగా మా మధ్య వచ్చిన విభేదాలను పరిష్కరించుకోవాలని ఎన్నోసార్లు ప్రయత్నించాను. నా భర్తతో నేరుగా మాట్లాడే అవకాశం కోసం ఇప్పటికీ ప్రయత్నిస్తూనే ఉన్నా. దురదృష్టవశాత్తూ నాకు ఆ అవకాశం దక్కలేదు 'ఈ ప్రకటనతో నేను, నా పిల్లలు షాకయ్యాం. ఇది పూర్తిగా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం. దీనివల్ల మాకు ఏమాత్రం మంచి జరగదు. బాధ కలిగినప్పటికీ నేను గౌరవంగా ఉండాలని భావిస్తున్నా. అందుకే పబ్లిక్‌గా కామెంట్ చేయడం లేదు. అన్యాయంగా నాపై నిందలు వేసి.. నన్ను తప్పుగా చూపిస్తున్న వార్తలు భరించడం కష్టంగా ఉంది. ఒక తల్లిగా, నా మొదటి ప్రాధాన్యం ఎప్పుడూ నా పిల్లల శ్రేయస్సే. ఈ వార్త వారిపై ప్రభావాన్ని చూపుతుందనే విషయం నాకు బాధ కలిగిస్తోంది. కాలం అన్నిటికీ సమాధానం చెబుతుందని నేను నమ్ముతున్నా. ఇన్ని రోజులుగా మాకు మద్దతు ఇచ్చిన ప్రెస్, అభిమానులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా. మీ ప్రేమే మాకు బలం. మా గోప్యతకు ఎలాంటి భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా' అని ఆర్తి పేర్కొన్నారు.




## సోషల్ మీడియా జర్నలిస్ట్ కావాలని ఉంది: ఉపాసన

స్టార్ హీరో రామ్‌చరణ్ సతీమణి ఉపాసన ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. సినిమాలపై, సామాజిక అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకుంటుంటారు. అలానే వారి ఫొటోలను కూడా ఎప్పటికప్పుడు షేర్ చేస్తూ అభిమానుల్లో జోష్ నింపుతుంటారు. తాజాగా ఉపాసన ఓ సిరీస్‌కు రివ్యూ ఇచ్చారు. అనన్య పాండే ప్రధానపాత్రలో నటించిన 'కాల్ మీ బే' సిరీస్ తనకు నచ్చిందని పేర్కొన్నారు. ఈ సిరీస్ పోస్టర్‌ను పంచుకున్న ఉపాసన.. ఇది చూశాక తనకు కూడా సోషల్ మీడియా జర్నలిస్ట్ కావాలనే కోరిక కలిగిందంటూ టీమ్‌ను ప్రశంసించారు. ఆ లక్ష్యంతోనే పని చేస్తున్నా.. అప్‌కమింగ్ సినిమాల వివరాలు పంచుకున్న ప్రశాంత్ వర్మ అనన్య పాండే నటించిన ఈ సిరీస్‌పై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. సారా అలీఖాన్, అలియా, నేహా దుఫియా వారి ఇన్‌స్టాలో ఈ సిరీస్‌పై పోస్ట్‌లు పెట్టారు. ఇలాంటి సిరీస్‌లో నటించినందుకు అనన్యను ప్రశంసిస్తున్నారు. 'నిన్ను చూస్తుంటే గర్వంగా' ఉందని పేర్కొంటున్నారు. 'లైగర్' చిత్రంతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన అనన్యకు తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. ఆ సినిమా విజయం సాధించనప్పటికీ ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి. కొన్ని సంవత్సరాలుగా మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆమెకు 'కాల్ మీ బే' సక్సెస్‌ను ఇచ్చింది. ప్రస్తుతం ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. కొల్లిన్ డి కున్హా దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ఓ ధనిక మహిళ చుట్టూ తిరుగుతుంటుంది. ధనవంతురాలైన ఓ మహిళ తన సంపదను కోల్పోయిన తర్వాత ఆమె జీవితం ఎలాంటి మలుపు తిరిగింది అనే అంశాన్ని ఇందులో చూపించారు. భర్త విడిచివెళ్లాక ఆమె ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొందో ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. ఇందులో ధనికురాలిగా అనన్య నటన ఆకట్టుకుంది.



## జై హనుమాన్ కోసం భారీగా కసరత్తు

### దర్శకుడు ప్రశాంత్ వర్మ వెల్లడి

ప్రస్తుతం టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ప్రశాంత్‌వర్మ సినిమాల కోసం ఎదురు చూస్తున్నారు. ఆయన తర్వాత సినిమాల లిస్ట్ చూసి బాక్సాఫీస్ వద్ద సంచలనం ఖాయమని అంటున్నారు. 'హనుమాన్'తో బ్లాక్‌బస్టర్‌ను సొంతం చేసుకున్న ప్రశాంత్ వర్మ.. దాని సీక్వెల్ పనుల్లో బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ.. 'జై హనుమాన్' విడుదల తేదీ, ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ గురించి వివరాలు పంచుకున్నారు. తన తర్వాత సినిమాల్లో బాలీవుడ్ స్టార్స్ కూడా నటిస్తారా అనే ప్రశ్నకు ఆసక్తికర సమాధానమిచ్చారు. ' ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ కోసం నేను కొందరు బాలీవుడ్ స్టార్స్‌ను కలిశాను. వారితో నా ఆలోచనలను పంచుకున్నాను. ఇందులో వారు కచ్చితంగా భాగమవుతారు. కాకపోతే కాస్త సమయం పడుతుంది. 'జై హనుమాన్' కోసం ఎంతోమంది కష్టపడుతున్నారు. స్క్రిప్ట్ వర్క్ పనులు జరుగుతున్నాయి. జై హనుమాన్' కంటే ముందు 'అధీరా' వస్తుంది. దీనితో పాటు మరో రెండు సినిమాలకు కూడా పనిచేస్తున్నాం. ప్రశాంత్ వర్మ లైనప్‌లో తాజాగా మోక్షజ్ఞ సినిమా చేరిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు ఎప్పుడు పంచుకుంటారా అని అభిమానులు ఆసక్తిగా ఉన్నారు.

**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com